క్లుప్తంగా

రేపు సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : ఈనెల 25వ తేదీన ఎల్కతుర్తి మండల కేంద్రంలోని 'ది విశాల సహకార సంఘం ' లో 25వ వార్షిక మహాసభ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సీఈఓ తిరుపతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రైతులు, సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పొలంలో బొగ్గులారీ పల్టీ



పరకాల : పట్టణంలోని చలివాగు వంతెన సమీపంలో బొగ్గులారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. భూపాలపల్లి నుంచి ఉప్పల్‌కు వెళ్లే బొగ్గులారీ చలివాగు వంతెన మీదకు చేరుకోగానే అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. దీంతో లారీలోని బొగ్గంతా పచ్చని పంట పొలాల్లో పడింది. తమకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. కాగా లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రారంభమైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సాక్షి ఎఫెక్ట్..

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వర్గపోరుతో నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల నుంచి సాక్షి దినపత్రికలో 'కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేనా'..? అనే వరుస కథనాలకు అధికారులు స్పందించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

పొదుపుతో ఉపయోగం

వరంగల్: ప్రతి వ్యక్తి కుటుంబ ఆర్థిక అవసరాలకు పొదుపు ఎంతో ఉపయోగపడుతుందని కాశిబుగ్గలోని యునైటెడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం సంఘం 40వ సర్వసభ్య వార్షికోత్సవ సమావేశం తిలక్‌రోడ్‌లోని కేవీఎస్ గార్డెన్స్‌లో జరిగింది. ఈసందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ 2024–25కు సంబంధించిన వార్షిక నివేదికను సభ్యులకు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామ రమేష్, వంగరి ప్రకాష్, సిలువేరు థామస్, గజ్జల రామకృష్ణ, శ్వేతాబాబు, లకుం భాస్కర్, రాజు, బయ్య స్వామి పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేసింది కాంగ్రెస్ నాయకులే'

నయీంనగర్: ఎన్నికల ముందు అజాంజాహి మిల్లు కార్మికులు ఎక్కడ కోరితే అక్కడ స్థలం ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఇవ్వకుండా మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విమర్శించారు. ఆదివారం హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అజాంజాహి మిల్లు స్థలాలనే ఇస్తామని కార్మికులను నమ్మించి ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని మోసం చేశారన్నారు. 2015లో కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంఆర్‌ఓ ద్వారా సర్వే నంబర్ మార్చారన్నారు. కార్మిక భవనం సర్వే నంబర్ మార్చి గొట్టిముక్కల నరేష్ రెడ్డికి అప్పగించారని, వ్యవసాయ భూములను మాత్రమే మ్యుటేషన్ చేసే హక్కు ఉంటుందని మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నంబర్ ఉన్న భవనాన్ని మ్యుటేషన్ చేసిన ఎంఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కాంగ్రెస్ హయాంలో అజాంజాహీ మిల్లు మూతపడిందన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రామన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షర్ల సంఘం జిల్లా శాఖ డి మాండ్ చేసింది. ఆదివారం పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ సమావేశం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళా శాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వీరాస్వామి, ఉపాధ్యక్షుడు రామ మనోహ ర్.. మాట్లాడారు. నరసింహారాములు, హనుమంతరావు, సుధాకర్, భిక్షపతి, జ్యోతి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

8 కిలోమీటర్లు..18 మలుపులు



బావుపేట గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



గుంటూరుపల్లి శివారులో..

- బావుపేట, కేశవాపూర్ రోడ్డు యమడేంజర్
- నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



తిమ్మాపూర్ వెళ్లే దారిలో..



కేశవాపూర్ సమీపంలో..

ఎల్కతుర్తి : అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అసమర్థత కారణంగా వాహనదారులు పలు చోట్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లన్ని అనేక మలుపులతో ప్రమాదకరంగా మారాయి. ప్రతీ మలుపు వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని వల్బాపూర్ నుంచి దండేపల్లి, కోతులనడుమ నుంచి జీల్గుల, పెంచికపేట క్రాస్ నుంచి జగన్నాథ్‌పూర్, బావుపేట క్రాస్ నుంచి కేశవాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మలుపులు యమ డేంజర్‌గా మారాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎక్కువగా బావుపేట క్రాస్ నుంచి కేశవాపూర్ గ్రామం వరకు వెళ్లే రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ గ్రామాల నడుమ రోడ్డు కేవలం 8కిలో మీటర్ల దూరం ఉన్నా మధ్యలో మరో మూడు గ్రామాలు ఆరేపల్లి, గుంటూరుపల్లి, తిమ్మాపూర్ గ్రామాలు ఉన్నాయి. కాగా ఈ రోడ్డు పొడవునా సుమారు 18 మలుపులు ఉండగా ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనాదారులు తరుచూ ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు పాటుపడాలని పలువురు కోరుతున్నారు.

సూచిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి



సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకరమైన మలుపులను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వాహనాదారులు రాత్రివేళ ప్రయాణించే సమయంలో మలుపులు తెలియక ప్రమాదాలకు గురౌతున్నారు.

– రాజు, బీజేపీ నాయకుడు, కేశవాపూర్

వేబ్రిడ్జి తూకంలో తేడా..

- ధర్నాకు దిగిన రైతులు
- సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే రేవూరి, బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర : వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆగ్రహిస్తూ జాతీయ రహదారిపై ఆదివారం ధర్నాకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుర్గంపేట్ గ్రామంలో గల జైహనుమాన్ వేబ్రిడ్జిలో ఓ రైతు మొక్కజొన్న సీడ్‌ను తూకం చేయగా 6,330గా వచ్చింది. అయితే అంతకు ముందు అదే గ్రామంలోని మరో వేబ్రిడ్జిలో మొక్కజొన్న సీడ్‌ను రైతు తూకం వేయగా 6,495 వచ్చింది. దీంతో క్వింటాల్ 65 కిలోల తేడా వచ్చిందని, ఇంత తేడా ఎలా వస్తుందని రైతు ప్రశ్నించగా వేబ్రిడ్జి యజమాని దరుసుగా సమాధానం చెప్పాడని రైతులు ఆగ్రహించారు. దీంతో ట్రాక్టర్లను హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై అడ్డుగా పెట్టి ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే తూకంలో మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా రైతులను మోసం చేస్తున్న వేబ్రిడ్జి యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అటుగా వెళ్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకే శ్‌రెడ్డి వేర్వేరుగా రైతులతో మాట్లాడారు. కాగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా తూనికలు, కొలతల అధికారి శ్రీలతను సంఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. దీంతో వారు వేబ్రిడ్జిను పరిశీలించి తూకంలో తేడా ఉందని గుర్తించి జైహనుమాన్ వేబ్రిడ్జిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ధర్నాలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు, ఆత్మకూరు మండల అధ్యక్షుడు రాజేందర్, ఆత్మకూరు, దామెర, ఆత్మకూరు మండలాల రైతులు పాల్గొన్నారు.

లోపాలు ఉండొద్దు..

- ఇంటర్ బోర్డు అధికారి వెంకటేశ్వర్‌రావు



వరంగల్: ఇంటర్మీడియట్ పరీక్షపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉండొద్దని ఇంటర్‌బోర్డు అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. వరంగల్‌లోని ఎల్‌బీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈనెల 10 నుంచి మూల్యాంకనం ప్రారంభమైందని, ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు నూతన స్పాట్ వాల్యువేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు.

'ఉపాధి' పనులు వినియోగించుకోవాలి



దామెర : ఉపాధి హామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని వెంకటాపూర్, సింగరాజుపల్లి, దమ్మన్నపేట్, ఒగ్లాపూర్ గ్రామాలను ఆదివారం ఆమె సందర్శించి ఉపాధి హామీ కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం మస్టర్ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో వంద మంది కూలీలు పనులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మంజూరైన మెటీరియల్ పనులు ఈ నెల 31వ తేదీలోగా పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అనంతరం ఒగ్లాపూర్‌లో నిర్మిస్తున్న పౌల్ట్రీ షెడ్‌ను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

- సీఐ రంజిత్‌రావు



శాయంపేట : ఐపీఎల్ 18వ సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన సందర్భంగా క్రికెట్ అభిమానులు, యువకులు ఆన్‌లైన్ యాప్‌లలో బెట్టింగ్ పెట్టి మోసపోవద్దని శాయంపేట సీఐ రంజిత్‌రావు తెలిపారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్, జూదం చట్ట విరుద్ధమని అన్నారు. ఇది జీవితాలను నాశనం చేస్తుందని, కుటుంబాలను రోడ్డున పడేసి చిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉంటుందన్నారు. యువత, క్రికెట్ అభిమానులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోకూడదని అన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా 100, 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు రూ.1.4లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, సునీల్, సమ్మయ్య, కుమారస్వామి, సంపత్‌రెడ్డి, రహీంపాషా, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్



పరకాల : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టు



శాయంపేట : భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పరకాల : భారత దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అతిచిన్న వయస్సులో వణికించిన పోరాటయోధుడు భగత్‌సింగ్ బాటలో నేటి యువత ప్రయాణించాలని ప్రజాసంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మడికొండ రఘుపతి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నక్క చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని అమరధామంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్టులు అయిలయ్య, సునేందర్, రమేష్, నయింపాషా, చంద్రమౌళి, భాస్కర్, విజయ్ పాల్గొన్నారు.

శాయంపేట : యువత లక్ష్యాన్ని పాలకులు నీరుగారుస్తున్నారని ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజగురు సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని హనుమకొండ జిల్లా డివిజనల్ కార్యదర్శి నీల రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హంసారెడ్డి హాజరై భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. చైతన్య దీపిక, భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ చిన్న వయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యంపై గర్జించి దేశం కోసం, స్వాతంత్రం కోసం ఉరితాడును లెక్కచేయలేదని గుర్తు చేశారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచినప్పటికీ సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ పాలన, 10 సంవత్సరాలు పాలించిన బీజేపీ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. నాయకులు సావిత్రి, నాగార్జున, మహ్మద్ ఉస్మాన్, ఎంఎస్ రావు, భద్రయ్య, రవీందర్, సతీశ్, రంజిత్, శంకర్, రాజమౌళి, అనిల్, సునీల్, ప్రేమలత, మహేశ్, కృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

'నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలి'

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేసి స్వామినాథన్ కమిటీ సిఫార్సును అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భీమదేవపల్లి మండలం ములకనూరులో రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూర్తిసాయిలో రుణమాఫీ చేయాలని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా సన్నిల రవి, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శిగా బోడ బాలరాజు, మరో 15మంది సభ్యుల ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, కిషన్, రమేశ్ పాల్గొన్నారు.

కొంగలకు ఆహారంగా గుడి చెరువు చేపలు



ఎండిపోయిన చేపల చెరువు



మృతి చెందిన చేప పిల్లలు

- నీరు లేక మృతి
- రూ.15లక్షల నష్టం
- ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

శాయంపేట : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక శివారు గుడి చెరువులోని చేపలు ఇటీవల చనిపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో రూ.15లక్షల నష్టం వాటిల్లిందని గుత్తేదారు పల్లెబోయిన సురేష్, భాగస్వాములు ఎదుల రాజశేఖర్, జయశంకర్ వాపోయారు. వారి కథనం ప్రకారం.. 2024 జూన్‌లో పెద్దకోడెపాక, జోగంపల్లి మత్స్యశాఖ గుడి చెరువును రూ.4లక్షల 2వేలకు టెండర్ పట్టగా.. జూలైలో రూ.5లక్షల 20వేల విలువైన చేప పిల్లలు పోశారు. చలివాగు ప్రాజెక్టు ఎడమ కాల్వ నుంచి వచ్చే నీటిని ప్రాజెక్టు మరమ్మతు పనులు కారణంగా క్రాప్ హాలీడే ప్రకటించి డిసెంబర్ 20 నుంచి నీటిని నిలిపి చేశారు. చెరువులో ఉన్న నీటితో చేపలు పెంచుదామనుకుంటే కాంట్రాక్టర్ వచ్చి చెరువు కట్ట మరమ్మతుకు వచ్చిందని పది రోజుల క్రితం జేసీబీతో కుడి కాల్వ తూము నుంచి నీటిని పంపించాడు. దీంతో చెరువులో ఉన్న చేపలన్నీ చనిపోయి కొంగలకు ఆహారంగా మారాయని, రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లిందని మత్స్యకారులు వాపోయారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవ తీసుకుని నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు. చేపల మృతితో ఆర్థికంగా కుదేలయ్యామని వాపోయారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

విద్యారణ్యపురి/హన్మకొండ చౌరస్తా: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హనుమకొండలోని కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన మార్త సంపత్‌కు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంపత్ పిల్లలు బీ ఫార్మసీ, ఇంజనీరింగ్ చదువుతున్నారని తండ్రి అనారోగ్యంతో వారు ఉన్నత చదువులకు దూరం కాకుండా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం సంపత్ భార్య అనురాధ బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, పొన్నం రాజు, చిరంజీవి, రాజు, విజయ్, కొండల్‌రెడ్డి, మధు, పతంగి భాస్కర్, బరిగెల భాస్కర్, బోనాల రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

ఖిలా వరంగల్: కరీమాబాద్ ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన స్వర్ణకారుడు రాగి సోమేశ్వరాచారీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో స్నేహభావం



పరకాల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ధర్మసాగర్ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

- లౌకికవాదం, మత సామరస్యానికి రాష్ట్రం ప్రతీక
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



శాయంపేట : ఇఫ్తార్ విందులో పాల్గొన్న నారాయణరెడ్డి

పరకాల: లౌకిక వాదం, మత సామరస్య రక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందుపై పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్‌లో ముస్లింలు ఆచరించే కఠోర ఉపవాసం, దైవ ప్రార్థనలు, ఆధ్యాత్మికతను, క్రమ శిక్షణను పెంపొందిస్తాయన్నారు. ఇఫ్తార్ విందుతో స్నేహ భావం పెంపొందుతున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల, పట్టణ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ..

ధర్మసాగర్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జామియా మసీద్‌లో ఆదివారం రాత్రి బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని అన్నారు. ఉపవాసం ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ కమిటీ సభ్యులు లాల్‌మహ్మద్, జహింగీర్, యాసిన్, సుభాన్, సలీం, ఇస్మాయిల్, యాకుబ్‌పాషా, ముస్లిం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

శాయంపేట : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మదీన మజీద్‌లో మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణ రెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అన్నారు. ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. మత గురువు భాషావియా, ఖలీల్, రాజ్‌మహ్మద్, బీఆర్‌ఎస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీస్‌లు

దామెర: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రంలోని గజపటి జిల్లా అంతర్బాకు చెందిన బిషల్ బీరో, బబ్లూ నాయక్ ఇద్దరూ జల్సాలకు అలవాటుపడి ఈజీగా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. దీంతో వివిధ రాష్ట్రాల్లో గంజాయి విక్రయించాలనుకున్నారు. అనుకున్న ప్రకారం ఒడిషా నుంచి 19.510 కిలోల ఎండు గంజాయి రైలులో తీసుకొని వరంగల్‌కు చేరుకున్నారు. బస్సులో ప్రయాణిస్తే అనుమానం రాకుండా ఉంటుందని వరంగల్ నుంచి దామెర మండలంలోని ఊరుగొండకు బస్సులో చేరుకున్నారు. అక్కడి నుంచి ఆదివారం ఒగ్లాపూర్‌కు కాలినడకన వెళ్తుండగా దామెర ఎస్సై కొంక అశోక్ తనిఖీలు నిర్వహించారు. దీంతో అనుమానస్పదంగా ఉన్న ఇరువురిని తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా గంజాయి అమ్మడానికి వచ్చినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణ పనులు ప్రారంభించాలి



మామునూరు: స్మార్ట్ సిటీలో భాగంగా మంజూరైన రూ.25లక్షల నిధులతో 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదివారం స్థానికులు నిరసన తెలిపారు. మంజూరైన అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు కలిసి వినతిపత్రాలు అందజేసినా.. పట్టింపులేదని వాపోయారు. ఈ కాలనీకి మంజూరైన నిధులను ఇతర కాలనీలకు మళ్లించొద్దని స్థానికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక కార్పొరేటర్ కాలనీపై వివక్షత చూపుతున్నాడని ఆరోపించారు. కాలనీలో మట్టి రోడ్లు మరింత గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయని వాపోయారు. అధికారులు స్పందించి కాలనీ కి మంజూరైన నిధులతో పనులు చేపట్టాలని కాలనీ ప్రతినిధి ఉమ్మగాని ఉమేష్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో గంట సుమన్, చంద్రమౌళి పాల్గొన్నారు.